క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన కలిపి క్రీడాకారులు

రొద్దం: 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా జిల్లా స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో రొద్దం మండలం కలిపి సచివాలయ పరిధిలోని మహిళా క్రీడాకారుణులు సత్తాచాటారు. జిల్లా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుణులను పలువురు పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు అభినందించారు.

యోగి వేమన విగ్రహ ప్రతిష్ట


వేమన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని హొన్నంపల్లిలో ఆదివారం యోగి వేమన విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డి కులస్తుల ఆధ్వర్యంలో సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వేమన విగ్రహం వద్ద పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళాన్ని అందిస్తున్న దాతలు

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లిలో గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మిస్తున్న కరావులీశ్వర ఆలయానికి అదే గ్రామానికి ప్రసాద్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఆదివారం రూ.1,00,116 విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రేపటి రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు గొల్ల శ్రీరాములు, మేకల రంగప్పకు అందజేశారు.

చంద్రశేఖర్‌రెడ్డికి ఘన నివాళి


అమరవీరుడు చంద్రశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మిత్రబృందం

లేపాక్షి: అమరవీరుడు చంద్రశేఖర్‌రెడ్డి 14 వర్ధంతి సందర్భంగా మండలంలోని కోడిపల్లిలో ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. బోళసముద్రం 10వ తరగతి 1998–1999 బ్యాచ్ మిత్రులు ఆధ్వర్యంలో ఆదివారం చంద్రశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి 1999లో 10వ తరగతి పూర్తి చేసి 8 సంవత్సరాలు వ్యవసాయం చేశారన్నారు. 2007 జూన్‌లో జవాన్‌గా చేరారని, ఫిబ్రవరి 2010లో జార్ఖండ్ రాష్ట్రంలో జవాన్‌లకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని చెప్పారు. అనంతరం మావోలు పేల్చిన మందుపాతర ఘటనలో చంద్రశేఖర్‌రెడ్డి వీరమరణం పొందారన్నారు.

అగళి నుంచి పుట్టపర్తికి ఆర్టీసీ బస్సు సర్వీసు

మడకశిర: ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం నుంచి అగళి నుంచి పుట్టపర్తికి ఆర్టీసీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య తెలిపారు. ఉదయం 6:30 గంటలకు అగళి నుంచి బయలుదేరి రొళ్ల, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు మీదుగా పుట్టపర్తికి చేరుతుందన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ


వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురం సర్కిల్ వద్ద వడేర్ల సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో వడ్డెర్లు పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. నా సంఘం నాయకులు మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలంలో వారి నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన నాయకుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఆయన బాటలోనే వడేర్లు ఐక్యంగా కులాభివృద్ధికి కృషిచేస్తూ అన్నిరంగాలో వృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరాముడు, చిత్తూరు జిల్లా డీఎస్పీ వేణుగోపాల్, కౌన్సిలర్ మంజు, వడ్డెర సంఘం అధ్యక్షుడు రంగప్ప, నాయకులు దుర్గానవీన్, అంజినప్ప, ప్రసాద్, కంచెప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగు

- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్
- మడకశిర నియోజకవర్గంలో 42,867 ఇళ్లకు లబ్ధి
- సద్వినియోగం చేసుకుంటున్నామని లబ్ధిదారుల హర్షం



రొళ్ల: నిరుపేద ఎస్సీ, ఎస్టీలు వినియోగించే గృహ విద్యుత్‌కు పైసా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఆ వర్గాలకు అండగా నిలుస్తోంది. ఉచితంగా ఇళ్లకు సరఫరా చేస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని తూచా తప్పకుండా ఆచరణలో అమలు చేస్తుండటంతో బడుగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చేసిందేమి లేదు. పేరుకు మాత్రం నెలకు 120 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పి... ఎస్సీ, ఎస్టీ కుటుంబాలపై వివక్ష చూపుతూ అధిక బిల్లులు మోపేవారు. అధికారుల చేత విద్యుత్ చౌర్యం కింద కేసులు కూడా నమోదు చేయించి వేధించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీలకు ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని బడుగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల కష్టాలను తెలుసుకున్న నాయకుడి వెంటే తామంతా ఉంటామని చెబుతున్నారు. ఉచిత విద్యుత్‌తో పాటు అన్ని విధాలా ఎస్సీ,ఎస్టీలను ప్రోత్సహిస్తున్నారని కొనియాడుతున్నారు.

మడకశిర నియోజకవర్గంలో ఇలా...

మండలం	ఎస్సీ కుటుంబాల సంఖ్య	ఎస్టీ కుటుంబాల సంఖ్య
రొళ్ల	7,345	135
అగళి	6,620	866,
అమరాపురం	7,770	205
గుడిబండ	7,495	455
మడకశిర	12,110	646

42,867 ఇళ్లకు ఉచిత విద్యుత్

మడకశిర నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీలకు సంబంధించి 42,867 ఇళ్లు ఉన్నాయి. రొళ్లలో ఎస్సీ కుటుంబాలు 7,345, ఎస్టీ కుటుంబాలు 135 ఉన్నాయి. అగళిలో ఎస్సీ కుటుంబాలు 6,620, ఎస్టీ కుటుంబాలు 866 ఉన్నాయి. అలాగే అమరాపురంలో 7,770 ఎస్సీ కుటుంబాలు, 205 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. గుడిబండలో 7,495 ఎస్సీ కుటుంబాలు, 455 ఎస్టీ కుటుంబాలు నివాసమున్నాయి. మడకశిరలో 12,110 ఎస్సీ కుటుంబాలు, 646 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి.


ఆర్థిక భారం తగ్గింది



గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో ఎస్సీ కుటుంబానికి ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను సరఫరా చేస్తుండడంతో ఆర్థిక భారం తగ్గింది. ఎస్సీలంతా జగనన్నకు రుణపడి ఉంటాం. గతంలో మాదిరిగానే విద్యుత్‌శాఖ అధికారులు దాడుల చేస్తారని భయం కూడా ఇప్పుడు లేదు. పేదల కష్టాల గురించి ఆలోచన చేయడం హర్షణీయం.

– మంజునాథ్, ఆలూడి, అగళి

మా కుటుంబాలు బాగుపడ్డాయి



దినసరి కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే మాలాంటి వాళ్లకు విద్యుత్ బిల్లు కట్టాలంటే ఇబ్బందిగా ఉండేవి. కుటుంబ పోషణ కూడా కష్టతరంగా మారిన సమయంలో ప్రతి నెల విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుండం ఎంతో ఉపయోగంగా మారింది. జగనన్న హామీ ఇచ్చి నెరవేర్చడం హర్షణీయం. పేద ఎస్సీ కుటుంబాలు జీవితాలు బాగు పడ్డాయి.

– హనుమంతప్ప, బీజీ హళ్లి, రొళ్ల

జగన్‌కు రుణపడి ఉంటాం



నిరుపేదలైన ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నారు. ఇచ్చిన మాటను జగనన్న నిలబెట్టుకున్నారు. కూలీ పనులు చేసుకునే జీవనం సాగిస్తున్న మాలాంటి ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గింది. కరెంటు డబ్బులు మిగలడంతో కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నిరుపేదల ఇళ్లలో జగనన్న వెలుగులు నింపారు. మా మద్దతు మళ్లీ జగన్‌కే ఇస్తాం.

– వసియానాయక్, గుద్దదహళ్లితండా, గుడిబండ

పేదల కష్టాలను గుర్తించారు



గత టీడీపీ ప్రభుత్వం ఎస్టీ కుటుంబాల పట్ల చిన్న చూపు చూసేది. పేదల కష్టాలను గుర్తించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. బడుగులపై ఆర్థిక భారం పడకూడదన్న సదుద్దేశంతో అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా అందిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు కూడా ఇంటి ముంగిటకే అందిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి ఎస్టీ కుటుంబం జగనన్నకు అండగా ఉండాలి.

– ఆనంద్‌నాయక్, కేపీ తండా, రొళ్ల మండలం

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి


అమరాపురం జెడ్పీటీసీ స్వారక్కను కలసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

అమరాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప కోరారు. ఆదివారం మండలంలోని అమరాపురం, కెంకెర, కె.శివరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, భర్త నరసింహమూర్తి, దళిత నాయకుడు నారాయణప్ప, కెంకెరలో ఎంపీపీ ఈరన్న, కె.శివరంలో వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి తదితరులను కలసి పార్టీ కోసం పని చేయాలని కోరారు.

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా తనకు ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి ఎంతో ఆదరణ లభిస్తోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ శ్రేణులను కలసి తనకు సహకరించాలని కోరుతున్నానని చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజలు తనను ఎంతగానో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. మడకశిరలో వైఎస్సార్‌సీపీని గెలిపించడమే తన ధ్యేయమని తెలిపారు.

మంత్రి పర్యటన విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం మున్సిపాల్టీ పర్యటనను విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయర్త టీఎన్.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాల్టీ వ్యాప్తంగా 38వార్డుల్లో అన్ని కార్యక్రమాల్లో పాల్గొని చేయూతనిచ్చిన పార్టీ శ్రేణులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పేదల ప్రభుత్వాన్ని ఆదరించండి

గోరంట్ల: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలందరూ మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టండి' అని పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రెడ్డిచెరువుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిచెరువుపల్లి, వడ్డిపల్లి, తమ్మినాయినపల్లి, కాలేకుంటపల్లి, గుత్తివారిపల్లి గ్రామల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచ్ వినోద్‌కుమార్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి, జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు గంపల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెడ్డి చెరువుపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహిస్తున్న చరణ్‌రెడ్డి

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- డీఎస్పీ బాజీజాన్‌సైదా

మడకశిర: త్వరలో జరిగే సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా సూచించారు. ఆయన ఆదివారం ఆకస్మికంగా మడకశిర పీఎస్‌ను తనిఖీ చేశారు. స్థానిక సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ లోకేశ్‌తో సమావేశమయ్యారు. కేసుల వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఎన్నికల ఏర్పాట్లపై కూడా ఆరా తీశారు. ప్రధానంగా సమస్యాత్మక గ్రామాల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. త్వరలోనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని తెలిపారు.

అగళి: స్థానిక పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ బాజీజాన్‌సైదా ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్నందున బార్డర్ లోనూ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బ్యాడిగెరె వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐలు శ్రీరాములు, బషీర్ తదితరులు డీఎస్పీ వెంట ఉన్నారు.

రొళ్ల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై సిబ్బంది నిఘా పెట్టాలని డీఎస్పీ ఎస్‌కే బాజీజాన్‌సైదా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం రొళ్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించి పాత పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.


అగళి మండల పరిధిలోని బ్యాడిగెరె చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ

వ్యక్తి అదృశ్యం


రవికుమార్ (ఫైల్)

అగళి: మండల కేంద్రంలోని సిగంధురేశ్వరి జువెలరీ షాప్ యజమాని శివకోటాచారి కుమారుడు రవికుమార్ (42) అదృశ్యమయ్యాడు. తనకు ఆరోగ్యం సరిగా లేదు, ఇంటికెళ్తున్నానని చెప్పి గత నెల 29న షాపు నుంచి వెళ్లిన రవికుమార్ అప్పటి నుంచి కనిపించకుండా పోయాడని ఆయన భార్య శైలజ తెలిపారు. అన్నిచోట్లా గాలించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

శాంతిభద్రతలు పరిరక్షిస్తాం


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ఈరన్న

హిందూపురం అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని హిందూపురం రూరల్ సర్కిల్ సీఐగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన ఈరన్న పేర్కొన్నారు. ఎన్నికల వేళ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం ఆయన డీఎస్పీ కంజాక్షన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పుట్టింటికి చేరిన ముత్యాలమ్మ

పావగడ: పట్టణంలోని కావలగేరి వీధిలో మారెమ్మ జాతరోత్సవాల సందర్భంగా మారెమ్మ గుడిలో ప్రతిష్ఠించిన నసనకోట ముత్యాలమ్మను తన పుట్టినిల్లు అయిన ఏడుకురాకులపల్లికి భక్తిశ్రద్ధలతో సాగనంపారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి భారీ ఊరేగింపుతో అమ్మవారిని తరలించారు. మహిళలు ముత్యాలమ్మకు కుంకుమ పూజలు చేసి సారెలు సమర్పించారు. ముత్యాలమ్మను పుట్టింటికి సాగనంపుతున్న సమయంలో భక్తులు ఆవేదనకు గురయ్యారు. ప్రతి మూడేళ్లకోసారి పట్టణంలోని కావలగేరిలో జరిగే మారెమ్మ జాతరోత్సవాలకు నసనకోట ముత్యాలమ్మను ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది.


నసనకోట ముత్యాలమ్మను సాగనంపుతున్న దృశ్యం

మేలు జరిగి ఉంటే మరో అవకాశమివ్వండి

- మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది ఉంటే వైఎస్సార్‌సీపీకి మరోసారి ఓటు వేసి పట్టంకట్టండి' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. ఆత్మీయ పలరింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని బ్రహ్మసముద్రం, మేకలపల్లి, మండ్లి, రూకలపల్లి, కొల్లకుంట, ముద్దపుకుంట, జూలకుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన వలంటీర్ల ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయం, నాడు – నేడుతో పాఠశాల అభివృద్ధి చేశామన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు ఏనాడూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టించుకున్న పాపానపోలేదని విమర్శించారు.


మండ్లిలో పర్యటిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన జత కట్టి ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమానికి కృషి చేస్తూ వారికి అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. అన్ని వర్గాల వారికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, ఎంపీపీ గంగమ్మ, వైస్ ఎంపీపీలు రత్నమ్మ, వెంకటనారాయణరెడ్డి, సర్పంచులు కిష్టప్ప, పరంధామ, మాజీ సర్పంచులు కిష్టప్ప, పరంధామ, కంబాలప్ప, రమాకాంత్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు కొల్లప్ప, ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పుష్ప, అంజినప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజి, ఆదెప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, చంద్ర, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత


నాగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గీత

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఎల్లోటి గ్రామానికి చెందిన వలంటీర్ గీత బెంగళూరుకు వెళ్లి వృద్ధురాలు నాగమ్మకు రూ.3 వేల పింఛన్‌ను ఆదివారం అందజేశారు. నాగమ్మ అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకొని బెంగళూరు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ డబ్బు అందించారు.

సర్పంచ్‌కు పరామర్శ

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట సర్పంచ్ సోమును రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఆదివారం పరామర్శించారు. గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి సర్పంచ్ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి .. సర్పంచ్ నివాసానికి వెళ్లి ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ద్విచక్ర వాహనం అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో జిలాన్ అనే యువకుడికి చెందిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఆపి ఉంచిన వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

హీట్ వాటర్ ప్లాంట్ వితరణ

హిందూపురం టౌన్: రెబల్‌స్టార్ కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి ప్రభాస్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో హీట్ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ప్రభాస్ ఫ్యాన్స్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ఆస్పత్రి ఆవరణలోని మాతాశిశు వార్డు వద్ద వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఆలయ కమిటీ సభ్యుల సమావేశం

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయ కమిటీ సభ్యుల సమావేశం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. మహాశివరాత్రి బ్రహోత్సవాలు, ఆలయ పరిపాలన పరిస్థితులు, ఉత్సవాలకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తదితర విషయాలపై చర్చించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తితో పాటు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు తెలిపారు. అనంతరం రూ.30 వేలు విలువ చేసే మందులను అందజేశారు.

ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం


ఆలయంలో హోమం చేస్తున్న వేదపండితులు

హిందూపురం: పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న పురాతన శ్రీరామ ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం ప్రత్యేక పూజలు

పెనుకొండ: విశ్వశాంతి కోసం పట్టణంలోని సత్యసాయి బాబా భజన మందిరంలో ఆదివారం పట్టణ వాసులు ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులు, వారి పిల్లలతో కలసి దాదాపు 75 మంది పూజల్లో పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం రేపు

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి మంగళవారం గ్రామ సచివాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించి పాల్గొవచ్చన్నారు.

నేడు చింత ఫలసాయం వేలం

మడకశిరరూరల్: మడకశిర మండలంలోని కదిరేపల్లి పంచాయతీలోని చింత ఫలసాయం, వారపు సంత కోసం సోమవారం గ్రామ సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి నర్సేగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డులో ఆదివారం పావగడ నుంచి హిందూపురం వైపు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో విశ్రాంత లెక్చరర్ నాగరాజు, అరుణ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. నాగరాజు తలకు బలమైన గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.